# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 06-11-2025　　　　సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ సమాచార విశ్లేషణతో ప్రభుత్వ నిర్ణయాలు వేగవంతమవుతాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- ❖ ఉత్తరాంధ్రలోని కీలక ఇరిగేషన్ ప్రాజెక్టులను రానున్న 2 సంవత్సరాల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు.
- ❖ రాష్ట్రంలో 2029 నాటికి 1.5 మిలియన్ మెట్రిక్ టన్నుల గీన్ హైడ్రోజన్ ఉత్పత్తి అయ్యేలా పని చేస్తున్నామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తెలిపారు.
- ❖ ఆస్ట్రేలియాతో ఈరోజు జరిగిన నాలుగో టీ-20 క్రికెట్ మ్యాచ్ లో భారత్ 48 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది.
- ❖ బంగాళాఖాతంలో కొనసాగుతున్న ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో రేపు పలు చోట్ల తేలిక పాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం వెల్లడించింది.

=========================

డేటా ఆధారిత పాలన ఇప్పుడు అత్యంత కీలకంగా మారుతోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ప్రస్తుతం రియల్ టైమ్ గవర్నెన్స్ కాలం నడుస్తోందని సిటిజెన్ డేటా అంతా క్రోడీకరించామని చెప్పారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో డేటా ఆధారిత పాలనపై జరిగిన సదస్సుకి ముఖ్యమంత్రి ఈరోజు అధ్యక్షతవహించారు. ఈ సదస్సుకి రాష్ట్ర మంత్రులు, వివిధ శాఖల కార్యదర్శులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. సదస్సుని ఉద్దేశించి ప్రసంగించిన ముఖ్యమంత్రి.. దీర్ఘకాలిక, స్వల్పకాలిక లక్ష్యాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకుని పౌరులకు సుపరిపాలన అందించాలన్నారు. డేటా లేక్ ద్వారా అన్ని ప్రభుత్వ శాఖలకు చెందిన సమాచారాన్ని ఒక్క చోటే క్రోడీకరించి నిర్ణయాలు తీసుకునే వెసులుబాటు కల్పిస్తున్నామన్నారు. ఈ సమాచారాన్నిసమన్వయం చేసుకుని వేగంగా నిర్ణయాలు తీసుకోవాలని అధికారులకు ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు దిశా నిర్దేశం చేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

========================

ఉత్తరాంధ్రలోని కీలక ఇరిగేషన్ ప్రాజెక్టులను రానున్న రెండు సంవత్సరాల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. వీటి కోసం 2 వేల కోట్ల రూపాయలకు పైగా ఖర్చు చేయనున్నామని తెలిపారు. ఉత్తరాంధ్ర ఇరిగేషన్ ప్రాజెక్టుల పురోగతిపై నిమ్మల రామానాయుడు సంబంధిత అధికారులతో అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఈరోజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... బీఆర్ఆర్ వంశధార, తోటపల్లి, వంశధార-నాగావళి లింక్, జంఝావతి రిజర్వాయర్, హీరమండలం లిఫ్ట్, నాగావళి - చంపావతి, మహేంద్ర తనయ, తారక రామతీర్థసాగర్, మద్దువలస రిజర్వాయర్ వంటి కీలకమైన ప్రాజెక్టులను పూర్తి చేసేలా కార్యాచరణ సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ 9 ప్రాజెక్టులను పూర్తి చేసినట్లయితే ఉత్తరాంధ్రలో 1.24 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు సాగులోకి వస్తుందన్నారు.

========================

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని గ్రీన్ హైడ్రోజన్ హబ్ గా తీర్చిదిద్దేందుకు శరవేగంగా ప్రయత్నాలు జరుగుతున్నాయని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ చెప్పారు. ఆంధ్రప్రదేశ్ గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ అడ్వయిజరీ బోర్డు మొదటి సమావేశం రాష్ట్ర సచివాలయంలో ఈ రోజు జరిగింది. గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, అందుకు సంబంధించి చేపట్టిన ప్రాజెక్టులు తదితర అంశాలపై ఈ అడ్వయిజరీ కమిటీ చర్చించింది. ముఖ్యంగా 2030 నాటికి ఆంధ్రప్రదేశ్ ను గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిలో భారతదేశంలో అగ్రగామిని నిలపాలనే లక్ష్యంతో ఏపీ గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ డిక్లరేషన్ ను ప్రకటించడంతో పాటు ప్రత్యేకంగా ఒక అడ్వయిజరీ కమిటీని కూడా ఏర్పాటు చేయడం జరిగిందని కె.విజయానంద్ ఈ సందర్భంగా తెలిపారు. 2029 నాటికి సుమారు 1.5 మిలియన్ మెట్రిక్ టన్నుల గీన్ హైడ్రోజన్ ఉత్పత్తి లక్ష్యంతో పని చేయడం జరుగుతోందన్నారు. అదే విధంగా ఈ సమావేశంలో పాల్గొన్న నీతి ఆయోగ్ సభ్యులు, గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ అడ్వయిజరీ బోర్డు చైర్మన్ డాక్టర్ వి కె సరస్వత్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ బయోమాస్ విషయంలో దేశంలో మొదటి స్థానంలో ఉందని అన్నారు. గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి బయోమాస్ ఎంతో ఉపయోగపడుతుందని, తద్వారా రైతుల ఆదాయం పెరగడంతో పాటు ఉపాధి అవకాశాలు కూడా మరింత పెరుగుతాయని పేర్కొన్నారు.

విరామం

========================

గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాలను అమలు చేస్తున్నాయని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి స్మరణ్ రాజ్ తెలిపారు. బిర్సా ముండా 150వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని మారేడుమిల్లి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఆయన ఈరోజు స్థానిక ప్రజా ప్రతినిధులు, మహిళా సంఘాలు, అంగన్వాడి టీచర్లు, స్వచ్ఛంద సంస్థలు, వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఈ నెల ఒకటవ తేదీన ప్రారంభమయిన బిర్సా ముండా 150వ జయంతి ఉత్సవాలు ఈనెల 15వ తేదీ వరకు జరుగుతాయని చెప్పారు. పీఎం జన్ మన్, ఆది కర్మయోగి, జుగా వంటి కార్యక్రమాల ద్వారా మారుమూల గిరిజన గ్రామాలకు సైతం అభివృద్ధి ఫలాలు అందే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ రకాలైన పథకాలు ప్రవేశపెట్టడం జరిగిందన్నారు.

========================

రాష్ట్రంలోని పత్తి రైతులు ఎదుర్కొంటున్న సమస్యల దృష్ట్యా కేంద్ర జౌళి శాఖా మంత్రి గిరిరాజ్ సింగ్ కు రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు లేఖ రాశారు. 2025–26 ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 4.56 లక్షల హెక్టార్లలో పత్తి సాగు జరిగిందని, సుమారు 8 లక్షల మెట్రిక్ టన్నుల మేర ఉత్పత్తి అంచనా వేస్తున్నామని ఆ లేఖలో తెలిపారు. అయితే ఇటీవల మొంథా తుఫాను ప్రభావంతో పత్తి పంట తీవ్రంగా దెబ్బతినడంతో రైతులు కనీస మద్దతు ధర

కంటే తక్కువ ధరలకు పత్తిని విక్రయించాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సీఎం యాప్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం పత్తి కొనుగోళ్లు పూర్తిగా డిజిటలైజ్ చేసిందని చెప్పారు. అయితే కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కాపాస్ కిసాన్ యాప్ ను రాష్ట్ర సీఎం యాప్ తో అనుసంధానం చేసిన తర్వాత కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తి రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. అందువల్ల రైతుల సౌలభ్యం మేరకు తగు చర్యలు తీసుకోవాలని కేంద్రమంత్రిని అచ్చెన్నాయుడు లేఖలో కోరారు. ముఖ్యంగా రైతులు తమ సమీప జిల్లాల్లోని జిన్నింగ్ మిల్లులలో పత్తి విక్రయించుకునే విధంగా మ్యాపింగ్ చేయాలన్నారు.

========================

ఆస్ట్రేలియాతో ఈరోజు జరిగిన నాలుగో టీ-20 క్రికెట్ మ్యాచ్ లో భారత్ 48 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. క్వీన్స్ ల్యాండ్ లోని కరార్ ఓవల్ స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు నష్టపోయి 167 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా 18.2 ఓవర్లలో 119 పరుగులకు ఆలౌట్ అయింది. భారత బౌలర్లలో వాషింగ్టన్ సుందర్ 3, అక్షర్ పటేల్, శివమ్ దూబే చెరో 2 వికెట్లు తీసి విజయంలో కీలక పాత్ర పోషించారు. ఈ మ్యాచ్ విజయం సాధించడంతో భారత్ 2-1 తేడాతో సిరీస్‌లో ఆధిక్యం సాధించింది.

========================

నైరుతి బంగాళాఖాతం నుండి ఉత్తర కేరళ వరకు తమిళనాడు మీదుగా ఏర్పడిన నిన్నటి ద్రోణి ఈరోజు మధ్య బంగాళాఖాతం నుండి దక్షిణ కేరళ వరకు తమిళనాడు మీదుగా సగటు సముద్ర మట్టానికి 1.5 నుండి 5.8 కిలోమీటర్ల ఎత్తులో విస్తరించి  కొనసాగుతోందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా రాష్ట్రంలో పలు చోట్ల రేపు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారిణి జి. లక్ష్మీ వెల్లడిస్తూ…

(వాయిస్ 30 సెకన్లు)

========================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 83 వేల 459 పాయింట్ల వద్ద ప్రారంభమై.. చివరకు 148 పాయింట్లు నష్టపోయి 83 వేల 311 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 88 పాయింట్లు నష్టపోయి 25 వేల 509 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 88 రూపాయల 61 పైసలుగా ఉంది.

========================

భవిష్యత్ తరాలకు రసాయన రహిత ఆహారాన్ని అందించేందుకు ప్రకృతి వ్యవసాయాన్ని చేపట్టాలని ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రి సెల్వి సూచించారు. ప్రకృతి వ్యవసాయానికి ఏలూరు జిల్లాను కేంద్రంగా మార్చేందుకు  'నేచర్ వారియర్' బాధ్యతలను మహిళలు తీసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

========================
========================